రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్
- ధాన్యం కొనుగోలు కేంద్రంలో తనిఖీ

సిరిపురంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రోహిత్‌సింగ్

లింగాలఘనపురం, ఏప్రిల్ 16 : ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని సిరిపురంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. ఈ కేంద్రంలో ఇప్పటి వరకు 2,815 బస్తాలను సేకరించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వినయలత, ఏపీఎం శంకరయ్య, సీసీ శ్రీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బొట్ల శంకర్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు : ఎంపీడీవో

కట్కూర్‌లో బోరు మోటరును ఫిట్ చేస్తున్న సిబ్బంది

బచ్చన్నపేట, ఏప్రిల్ 16: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టామని ఎంపీడీవో రఘురామకృష్ణ అన్నారు. మండలంలోని కట్కూర్‌లో గ్రామ పంచాయతీ బోరు పనిచేయకపోవడంతో మూడు రోజులుగా తాగునీరందడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఎంపీడీవో రఘురామకృష్ణ మంగళవారం గ్రామానికి చేరుకుని సమస్యలు తెలుసుకున్నారు. బోరుమోటర్‌ను బిగించి ప్రజల దాహార్తిని తీర్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి బోరుబావులు ఎండిపోతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, ఆచార్య, కారోబార్ రాజు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశానికి తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

సుధీర్‌కుమార్‌ను గెలిపిస్తామని నేతల వెల్లడి

హనుమకొండకు వాహనాల్లో వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

లింగాలఘనపురం, ఏప్రిల్ 16 : హనుమకొండ శివారు మడికొండలోని సత్యసాయికన్వెన్షన్ హాల్లో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఆత్మీయ సమావేశానికి మండలం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఆయా గ్రామాల నుంచి స్వచ్ఛందంగా వాహనాల్లో వెళ్లి నెల్లుట్ల బైపాస్ రోడ్డు వద్ద నాయకులు, కార్యకర్తలు కలుసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి మడికొండకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య నేతృత్వంలో పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమయ్యామని తెలిపారు. వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్‌కు ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బస్వగాని శ్రీనివాస్‌గౌడ్, కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సేవెల్లి సంపత్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిట్ల ఉపేందర్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు ఏదునూరి వీరన్న, నాయకులు ఎండీ జానీమియా, ఎడ్ల రాజు, కేమిడి వెంకటేశ్, లింగాల వెంకటేశ్, ఎడ్ల తిరుపతి, గూటం రవి, గట్టగల్ల సంజీవ, సత్తయ్య, ఉడుగుల భాగ్యలక్ష్మి, కేమిడి వీరస్వామి, కేమిడి యాదగిరి, బెజ్జం చంద్రయ్య, గట్టగల్ల శ్రీహరి, గాదెపాక విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రాజయ్య రాకతో నయా జోష్..

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సొంత గూటికి రావడంతో మండలంలోని బీఆర్ఎస్ కార్యకర్తల్లో నూతనోత్సాహం నెలకొంది. ఉద్యమ సమయంలో కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజయ్య రాజీనామా చేసి తెలంగాణ వాదానికి మద్దతుగా వచ్చారు. బీఆర్ఎస్‌లో చేరి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కారు గుర్తుపై పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి అవకాశవాదంతో కాంగ్రెస్‌లో చేరారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బీఆర్ఎస్‌లో క్రియాశీలకంగా వ్యవహరిస్తుండడంతో కార్యకర్తల్లో జోష్ నెలకొంది.

- మచ్చలేని అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్
- అధికార దాహంతో కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి
- రాష్ట్ర ప్రభుత్వ అమలు కాని హామీలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి..
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- రాజకీయ అవకాశవాది కడియం శ్రీహరి..
- బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్

దేవరుప్పులలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

బీఆర్ఎస్ గెలుపు ఖాయమైంది

దేవరుప్పుల, ఏప్రిల్ 16: వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ కడియం కావ్యకు టికెట్ ఇచ్చిన రోజే బీఆర్ఎస్ గెలుపు ఖాయమైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో మంగళవారం బీఆర్ఎస్ కార్యకర్తల మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి ఎర్రబెల్లి, బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ హాజయ్యారు. ఎర్రబెల్లి మాట్లాడుతూ కారు గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి అధికార దాహంతో కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో కడియం శ్రీహరికి ఎన్నో పదవులు ఇచ్చి గౌరవించారని గుర్తు చేశారు. అవకాశవాదంతో కాంగ్రెస్‌లో చేరిన శ్రీహరి తన కూతురు కడియం కావ్యకు టికెట్ తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. దశాబ్దాలుగా కాంగ్రెస్‌లో సేవ చేస్తున్న వారికి టికెట్ ఇవ్వకపోవడంతో కసితో ఉన్న ఆ పార్టీ శ్రేణులు కావ్యను చిత్తుగా ఓడిస్తారని ఎర్రబెల్లి వివరించారు. ఈ ప్రభుత్వం ఆరు నెలలు కూడా ఉంటుందనే నమ్మకం ప్రజల్లో లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సైలెంట్ ఓటింగ్ ఉంటుందని, వరంగల్‌లో బీఆర్ఎస్ గెలుపు నల్లేరుమీద నడకేనన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు, హనుమకొండ జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్‌ను వరంగల్ ఎంపీ అభ్యర్థిగా పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారని ఆయన తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్, బీజేపీకి గుణపాఠం చెబుతారని, బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిస్తారని పేర్కొన్నారు.

మెజార్టీయే లక్ష్యంగా పనిచేద్దాం : ఎర్రబెల్లి

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి మెజారిటీ రావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి పిలుపునిచ్చారు. దేవరుప్పులలోని తిరుమల గార్డెన్‌లో మంగళవారం గ్రామాల వారీగా బూత్ లెవల్ సమావేశం నిర్వహించారు. ఎర్రబెల్లి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో తన ఓటమితో పార్టీ శ్రేణుల్లో కొంత నిరుత్సాహం ఉన్నా, పార్లమెంట్ ఎన్నికల్లో రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని కోరారు. అన్ని గ్రామాల్లో మెజారిటీ ఓట్లు వచ్చేలా చూడాలన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటానని, ఏ కష్టం వచ్చినా ఆదుకుంటానన్నారు. పనిచేయని వారే పార్టీ మారుతున్నారని, వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను మళ్లీ పాలకుర్తి నుంచి పోటీ చేసి గెలుస్తానన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, పీఏసీఎస్ చైర్మన్ లింగాల రమేశ్‌రెడ్డి, మండల నాయకులు వీరారెడ్డి దామోదర్‌రెడ్డి, పల్లా సుందరరాంరెడ్డి, బస్వ మల్లేశ్, చింత రవి, ధరావత్ రాంసింగ్, నవీన్‌నాయక్ పాల్గొన్నారు.

ద్రోహానికి మారుపేరు కడియం..
ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్

మోసాలు, ద్రోహాలకు నిదర్శనం కడియం శ్రీహరి అని చెప్పుకునే రోజు వచ్చిందని, బీఆర్ఎస్‌లో ఎన్నో పదవులు అనుభవించి అధికార పార్టీ కాంగ్రెస్‌లో చేరిన ఆయనను చరిత్ర క్షమించదని బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ అన్నారు. కావ్యకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చినప్పుడే బీఆర్ఎస్ గెలుపు సులువైందని, ఏ నియోజకవర్గంలో చూసినా కడియం శ్రీహరికి, కావ్యకు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు. తెలంగాణ అభివృద్ధిని చూడలేని కాంగ్రెస్ నాయకులు ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారన్నారు. మామునూరు ఎయిర్ పోర్టును ఆపిన ఘనత కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలదేనన్నారు. కాంగ్రెస్ పాలనలో సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయని, మొగులు వైపు చూసే రైతులు కేసీఆర్ వైపు చూస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపితే ఓరుగల్లు గళం వినిపించి అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బస్వ సావిత్రి, బీఆర్ఎస్ నాయకులు పల్లా సుందరరాంరెడ్డి, తీగల దయాకర్, బస్వ మల్లేశ్, చింత రవి, ధరావత్ రాంసింగ్, కొల్లూరు సోమయ్య, అనంతోజు కృష్ణమూర్తి, కోతి ప్రవీణ్,నవీన్ పాల్గొన్నారు.

భ్రూణ హత్యలకు పాల్పడితే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా, వెస్ట్‌జోన్ డీసీపీ సీతారాం, అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 16 : లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి భ్రూణ హత్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో వెస్ట్‌జోన్ డీసీపీ పీ సీతారాం, అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి పీసీ అండ్ పీఎన్డీటీ యాక్ట్–1994పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్త్రీ, పురుష లింగ నిష్పత్తి శాతాన్ని పెంచాలన్నారు. చట్ట వ్యతిరేకంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తామని తెలిపారు. వీటిని ప్రోత్సహించేవారితోపాటు సహకరించేవారికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.50వేల జరిమానా విధిస్తామన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ, పట్టణ స్థాయిలో ప్రజలకు లింగ నిష్పత్తిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో, స్కానింగ్ సెంటర్లలో అవగాహన కల్పించేలా ప్రచార వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్–2010 ప్రకారం జిల్లాలోని ప్రైవేట్ దవాఖానలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మండల స్థాయిలో ప్రత్యేక టీమ్‌లను నియమించి పీవోలు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు ప్రతి ఆసుపత్రిని సందర్శించి, పరిశీలించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ దవాఖానల్లో రికార్డులను నిర్వహిస్తూ, ఫైల్సను భద్రపర్చాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ లేని ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని షేక్ రిజ్వాన్ బాషా హెచ్చరించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ప్రతి ఆసుపత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, జిల్లాలో సాధారణ ప్రసవాల శాతాన్ని పెంచాలని కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా అన్నారు. ప్రజలకు సాధారణ ప్రసవాల అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. దీనిపై జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలో పనిచేసే సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతి దవాఖానలో లేబర్ రూమ్‌లను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు చేసేవారిపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ 104, 1098లో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్, డీసీహెచ్ఎస్ సుగుణాకర్‌రాజు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, పీవోలు, మెడికల్ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక

జిల్లా ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 16 : వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హరిచందన ఉమ్మడి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా మాట్లాడుతూ జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు 27పోలింగ్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటిలో జనగామ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 17, స్టేషన్ ఘన్‌పూర్‌కు 10 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. జిల్లాలో పట్టభద్రుల ఓటర్ల సంఖ్య 23,320 మంది ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ బాక్సులు, స్ట్రాంగ్ రూమ్‌లను పర్యవేక్షించినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా సహాయ ఎన్నికల అధికారులు రోహిత్ సింగ్ (జనగామ), వెంకన్న (స్టేషన్ ఘన్‌పూర్), ఈడీఎం దుర్గారావు, ఏవో రవిందర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోమల్ల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, తల్లులు

అంగన్‌వాడీ సెంటర్లను వినియోగించుకోవాలి

రఘునాథపల్లి, ఏప్రిల్ 16 : పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నారులు, తల్లులు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరస్వతి అన్నారు. మండలంలోని కోమల్లలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం స్కూల్ డే నిర్వహించారు. సరస్వతి మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటలతో బోధన అందించడం ద్వారా వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు వీలుందన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారం దుర్వినియోగం కాకుండా చూడాలని ఆమె సూచించారు.

ఇప్పగూడెంలో..

స్టేషన్ ఘన్‌పూర్ : మండలంలోని ఇప్పగూడెం 4వ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం స్కూల్‌డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ దివ్య, అంగన్‌వాడీ టీచర్ చట్ల మంజుల హాజరై చిన్నారులకు నూతన వస్త్రాలు అందించారు. వారి తల్లిదండ్రుల సమక్షంలో ఆటపాటలు కొనసాగించి ప్రోగ్రెస్ కార్డులను అందించారు. కార్యక్రమంలో ఆయా సులోచన పాల్గొన్నారు.

సాగరంలో..

జఫర్‌గఢ్ : మండలంలోని సాగరంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆట, పాటలను ప్రదర్శించారు. టీచర్లు నేర్పించిన అక్షరాలను విద్యార్థులు రాసి చదివారు. అనంతరం ప్రోగ్రెస్ కార్డులను అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు అందించారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, జీ విజయరాణి, ఆయాలు కవిత, సత్తమ్మ, ఓర్సు ఎల్లమ్మ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పల్లా పరామర్శ

జనగామ రూరల్, ఏప్రిల్16: మండలంలోని చౌడారం మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సలేంద్ర కొమురయ్య తండ్రి నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. జనగామ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షురాలు బొల్లం శారద, మాజీ సర్పంచ్ ముక్క రాజయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ప్లాట్లు అమ్మబడును

★వరంగల్ ట్రైసిటికి హైవేలను ఆనుకొని ఉన్న మా వెంచర్లలో ప్లాట్లు తక్కువ ధరలలో అమ్మబడును. సంప్రదించవలసిన సెల్ నెంబర్. 9701396797.
NTW-323041

లోన్స్

★SBH లో ఖాతా ఉన్న ప్రభుత్వ ఉద్యోగస్తులకు శుభవార్త, ఎటువంటి సమస్యలున్న Solve చేసి లోన్స్ ఇప్పించబడును. సంప్రదించండి సెల్ : 9493910808.
NTW-00

WANTED

★Wanted Cinema Managers to work at Asian Gemini theatre, experience: 5-10 years, interested ones call to 8121021251, hr.corp@asiancinemas.in
NT-6583

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

'ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు'

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 16 : 'కాంగ్రెస్ పార్టీ మాదిగల ద్రోహి.. పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటమి తప్పదు..' అని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిశోర్ మాదిగ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీలకు రిజర్వ్ చేసిన పెద్దపల్లి, నాగర్ కర్నూల్, వరంగల్ ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించలేదని విమర్శించారు. మాదిగ సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహం మాదిగల హృదయాలను తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ విషయంలో అబద్ధాలు ప్రచారం చేస్తున్నాడని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వంద రోజుల పాలనలో మాదిగలకు కల్పించిన ప్రాతినిధ్యం ఏమిటో వివరించాలని తెలిపారు. రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చిన పదవుల లెక్కలను కూడా బయట పెట్టాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మాదిగలు బొంద పెట్టడం ఖాయమని కిశోర్ పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైసా రాజశేఖర్, ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి సందెన రవిందర్, సీనియర్ నాయకుడు చుంచు రాజు, వీహెచ్‌పీఎస్ నాయకులు గడ్డం సోమరాజు, రాజు, యాకోబు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 16 : జిల్లా కేంద్రానికి చెందిన పాత్రికేయుడు బొమ్మగాని శ్రీకాంత్‌గౌడ్ మాతృమూర్తి నిర్మల ఇటీవల వడదెబ్బతో మృతి చెందింది. ఈ నేపథ్యంలో సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య రూ.10 వేల ఆర్థిక సాయాన్ని తన అనుచరుల ద్వారా మంగళవారం మృతురాలి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్, నాయకులు ఎండీ మాజిద్, సొడ మహేశ్, తుంగ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

జీపీలకు బాడీ ఫ్రీజర్ల బహూకరణ

బాడీ ఫ్రీజర్‌ను అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 16 : స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి గ్రామ పంచాయతీలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాడీ ఫ్రీజర్లను మంగళవారం ఆర్డీవో డీఎస్ వెంకన్న అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాడీ ఫ్రీజర్లు అందుబాటులో లేకపోవడంతో స్థానిక ప్రజలకు అసౌకర్యంగా ఉందన్నారు. ఎవరైనా చనిపోతే బాడీ ఫ్రీజర్‌ను వినియోగించుకునేలా లయన్స్ క్లబ్ సభ్యులు అందించడంతో స్థానికులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డీ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ఏదునూరి సత్యం, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యువాన్ జాన్, జోన్ చైర్మన్ మధుసూదన్, లయన్స్‌క్లబ్ సభ్యులు రంగాచారి, ఆర్డీ చారి, దస్తగిరి, వీటీ శ్రీనివాస్, గన్ను రమేశ్, ధనుంజయ పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానలో ఫిజియోథెరపి సేవలు

బాధ్యతలు స్వీకరించిన వైద్యులు

డాక్టర్ రవికుమార్, డాక్టర్ ప్రదీప్ కుమార్

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 16 : మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని 100 పడకల దవాఖానగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. దీంతో ఏరియా ఆస్పత్రిగా మారడంతో ఇందుకనుగుణంగా వైద్యులు, సిబ్బంది నియామకం చేపట్టారు. ఇటీవల స్త్రీల వైద్య నిపుణురాలు, ఎముకల వైద్యుడు, పిల్లల డాక్టర్, చర్మ వ్యాధి నిపుణుడు, మత్తు డాక్టర్‌తోపాటు 26మంది స్టాఫ్ నర్సులు విధుల్లో చేరారు. తాజాగా సోమవారం ఫిజియో థెరపిస్ట్ విధుల్లో చేరారు. వీరితోపాటు పీహెచ్‌సీకి సంబంధించిన ఇద్దరు వైద్యులతో కలిపి మొత్తంగా 10 మంది డాక్టర్లు రోగులకు సేవలందిస్తున్నారు. ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ రవికుమార్, ఆర్థోపెడిక్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ వ్యాధులను ముందస్తుగా నిర్ధారిస్తే త్వరగా నయం చేసుకునే అవకాశముందన్నారు. ప్రైవేటు దవాఖానలకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడొద్దని, ప్రభుత్వాసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు ప్రజలను కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 16 : డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇటీవల పోలీసులకు పట్టుబడిన జనగామ మండలం పెద్దపాడుకు చెందిన ఏదునూరి ఉపేందర్‌కు ఒకరోజు జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించారు. ఈ మేరకు మంగళవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామనర్సయ్య తీర్పు ఇచ్చినట్లు అర్బన్ సీఐ ఎల్ రఘుపతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సీఐ రఘుపతిరెడ్డి మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడుపొద్దని వాహనదారులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

అవగాహన కల్పిస్తున్న అగ్నిప్రమాపక అధికారులు

పాలకుర్తి, ఏప్రిల్ 16 : అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి సీహెచ్ శ్రీరాములు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో వంటగ్యాస్ ఏజెన్సీ ప్రాంగణం, ఫిల్లింగ్ స్టేషన్‌లో ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు జరిగితే వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారమివ్వాలని సూచించారు. ఆపద సమయంలో ఒకరికొకరు సహాయం చేసుకోవాలన్నారు. వంటగ్యాస్ సిలిండర్‌లో మంటలు వస్తే నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అగ్నిమాపకులు కిరణ్‌కుమార్, శ్యాంసుందర్, వెంకటేశ్వర్లు, గోపాల్ పాల్గొన్నారు.

నేడు రాములోరి కల్యాణం

- జీడికల్, నవాబుపేట ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి
- తరలిరానున్న భక్తజనం

జీడికల్‌లోని సీతారాముల ఆలయం

జీడికల్ ఆలయంలోని ఉత్సవమూర్తులు

లింగాలఘనపురం, ఏప్రిల్ 16 : శ్రీరామ నవమిని పురస్కరించుకుని మండలంలోని జీడికల్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయం, నవాబుపేటలోని కోదండ రామాలయంలో బుధవారం వేడుకలు జరుగనున్నాయి. స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు దేవస్థాన అధికారులు, అర్చకులు ఏర్పాట్లు చేశారు. జీడికల్ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఏటా రెండు కల్యాణాలు నిర్వహించడం ఆనవాయితీ. కార్తీక మాసంలో పౌర్ణమి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై, పునర్వసుయుక్త కర్కాటక లగ్నంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. శ్రీరామ నవమినాడు దేశవ్యాప్తంగా శ్రీరాముడి కల్యాణం కొనసాగిస్తారు. నవాబుపేట కోదండరామస్వామి ఆలయంలో ఏటా ఉగాది పండుగ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. శ్రీరామనవమి రోజు తిరుకల్యాణం చేస్తారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆలయంలోని ధ్వజస్తంభానికి గరుడ ముద్ద వితరణ జరిపించారు. ఈ నేపథ్యంలో జీడికల్, నవాబుపేట ఆలయాల ప్రాంగణాల్లో చలువ పందిళ్లు వేశారు. భక్తులకు అసౌకర్యం లేకుండా దేవాదాయశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమాల్లో ఈవోలు లక్ష్మీప్రసన్న, వంశీ, సిబ్బంది కుర్రెముల మోహన్, సరోజన, రవితేజ, వసంత, రమేశ్, లక్ష్మి, ఎల్లగౌడ్, శారద, కేకే రాములు, భరత్‌కుమార్, మల్లేశం, పూజారులు భార్గవాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు, లక్ష్మీనరసింహాచార్యులు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి, వల్మిడి ఆలయాల్లో ఏర్పాట్లు



విద్యుత్ వెలుగుల్లో వల్మిడిలోని సీతారామచంద్రస్వామి ఆలయం

పాలకుర్తి : మండలంలోని వల్మిడిలో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు దేవాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. రాముని గుట్ట(క్షేత్రం)పై నిర్వహించే సీతారాముల కల్యాణానికి వేలాదిగా భక్తులు తరలిరానున్నారు. సీతారాముల కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవస్థాన ఈవో భాగం లక్ష్మీప్రసన్న తెలిపారు. మరోవైపు పాలకుర్తిలోని పాటిమీద ఆంజనేయస్వామి ఆలయం వద్ద సీతారామచంద్రస్వామి కల్యాణానికి ఏర్పాట్లు చేసినట్లు అర్చకుడు గంగు రఘు తెలిపారు. సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, విస్నూరులోనూ సీతారామచంద్రస్వామి కల్యాణం నిర్వహించనున్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్ ఘన్‌పూర్ : శ్రీరామ నవమి వేడుకలకు మండల కేంద్రంలోని తిరుమలనాథస్వామి ఆలయం, శివునిపల్లిలోని నగరేశ్వరాలయం, తాటికొండలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం ముస్తాబయ్యాయి. ఆలయాలను రంగులతో అలంకరించి, వేసవిలో భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు వేశారు. తాగునీటి సౌకర్యం కల్పించారు. బుధవారం సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలిరావాలని ఉత్సవ కమిటీ బాధ్యులు కోరారు.

వేడుకలకు సిద్ధమైన శివునిపల్లిలోని నగరేశ్వరాలయం